క్లుప్తంగా

ముక్కిడి పోలమ్మకు చల్లదనం



ముక్కిడి పోలమ్మ గుడివద్ద ముర్రాటలతో భక్తులు

సీతంపేట: పులిపుట్టి సమీపంలో కన్నెధార కొండ వద్ద వేంచేసి ఉన్న ముక్కిడి పోలమ్మకు భక్తులు శుక్రవారం ముర్రాటలు సమర్పించి, చల్లదనం చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన



సహస్ర దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీతంపేట: మండల కేంద్రంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 1008 దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకుడు వేమకోటి సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో మహర్నవమి పూజలు చేశారు.

హడలెత్తిస్తున్న శునకాలు



ప్రధాన మార్కెట్ రహదారిలో కుక్కల గుంపు

పాలకొండ రూరల్: పట్టణంలో ఎక్కడ చూసినా శునకాల గుంపులు హల్‌చల్ చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా చేఉకుని బాటసారులపై దాడులు చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా కుక్కలు సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌కు పండగ శోభ



వినియోగదారులతో కిక్కిరిసిపోయిన పాలకొండ ప్రధాన మార్కెట్

పాలకొండ రూరల్: పట్టణంలోని ప్రధాన మార్కెట్ వినియోగదారులతో శుక్రవారం సాయంత్రం కళకళలాడింది. దసరా నేపథ్యంలో ప్రజలు మార్కెట్‌కు పోటెత్తారు. పూలు, మట్టి కుండలు, పత్రి, కొబ్బరికాయలు, అరటిపళ్లు, బెల్లం, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, తదితర సామగ్రి కొనుగోలు చేశారు. మరోవైపు పండగ ఆఫర్లతో వెండి, బంగారు, గృహోపకరణాలు, సెల్‌షాపులు వినియోగదారులతో కిటకిటలాడాయి. మరోవైపు కోళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు కూడా జోరందుకున్నాయి.

దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: అమ్మలుగన్న అమ్మ దుర్గమ్మ చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రార్థించారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని రామాకాలనీలో ఏర్పాటుచేసిన దుర్గమ్మను శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అమ్మవారికి ఈ సందర్భంగా సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. రాజన్నదొర వెంట పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా కోటదుర్గమ్మ



వీరఘట్టం: చలివేంద్రి గ్రామంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పాలకొండ: మహిషాసురమర్దిని అవతారంలో కోటదుర్గమ్మ



వీరఘట్టంలో : ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కోటదుర్గ

పాలకొండ: దసరా ఉత్సవాలలో భాగంగా కోటదుర్గమ్మ శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం తిరువీధి నిర్వహించనున్నట్లు కోటదుర్గమ్మ సిబ్బంది తెలిపారు. ఇందుకోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

లోకమాతా నమో నమః..

వీరఘట్టం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 9వ రోజు యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మ యాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. లోకమాతా నమో నమః అంటూ భవానీ భక్తులు తొలుత పూజలు చేయగా.. తర్వాత ఉదయం 6 గంటల నుంచి 11 వరకు.. తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా మహిళలు కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు దుర్గాదేవిని దర్శించుకుని విశిష్ట పూజలు చేశారు. అలాగే చలివేంద్రి గ్రామంలో భవానీ భక్తుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

నేడే విజయదశమి పూజలు

- కోటదుర్గ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు



కోటదుర్గమ్మ

వీరఘట్టం: మండల కేంద్రంలోని కోటదుర్గ ఆలయం విజయదశమికి సిద్ధమైంది. శనివారం ఉదయం నాలుగు గంటల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని ఆలయ సిబ్బంది తెలిపారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మ యాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఎంతో ప్రాచుర్యం ఉన్న వీరఘట్టం కోటదుర్గమ్మను ఈ ప్రాంత ప్రజలు ఇష్ట దైవంగా కొలుస్తుంటారు. పూర్వం వీరఘట్టంను పరిపాలించిన కొండరాజుల కోటలో కొలువుదీరిన దుర్గా దేవిని కోటదుర్గగా పిలిచేవారు. అప్పటినుంచి ప్రతిఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు.



గరుగుబిల్లి: నాగూరులో దుర్గమ్మ మండపం వద్ద ఏర్పాట్లు చేసి, పూజలు చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయదశమి పూజలకు మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి, రావివలస, నాగూరు తదితర గ్రామాల్లోని దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొననున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

పటిష్ట బందోబస్తు

గుమ్మలక్ష్మీపురం: విజయదశమి పూజల నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా మండలంలోని నేరేడువలస గ్రామ సమీపంలో ఉన్న మాలతమ్మ ఆలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. శుక్రవారం మందిరాన్ని సందర్శించిన ఆయన పూజల నిర్వహణ, భక్తుల దర్శనార్థం చేసిన ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏజెన్సీ ప్రజల ఆరాధ్య దైవమైన మాలతమ్మను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు వస్తున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఎల్విన్‌పేట సీఐ డి.హరి, కురుపాం ఎస్‌ఐ పి.నారాయరావులకు తెలిపారు.



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ రాంబాబు

తిరువీధికి సహకరించాలి

- డీఎస్పీ రాంబాబు

పాలకొండ: కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం జరగనున్న తిరువీధి ఉత్సవం విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని డీఎస్పీ ఎం. రాంబాబు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమ్మవారి తిరువీధి సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. తిరువీధి సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు నిలిపివేశామని తెలిపారు. సుమారు 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

బడిదేవరకొండ క్వారీ పనులు ఆపాలి

పార్వతీపురంటౌన్: బడిదేవరకొండ క్వారీ పనులు ఆపాలని కొన్నాళ్లుగా ఆందోళన చేపడుతున్నా క్వారీ యాజమాన్యం పట్టించుకోకపోవడం అన్యాయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రోజుల్లో గ్రానైట్ యాజమాన్యం తీవ్రమైన ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు.

డ్యాన్స్ పోటీల విజేత కడగండివలస

సీతంపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మల్లెమ్మతల్లి గుడి వద్ద జరిగిన శుక్రవారం నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో విజేతగా కడగండివలస యువత నిలిచారు. రెండో స్థానంలో కోడిశ, మూడో స్థానంలో ఎర్రన్నగూడ, నాలుగో స్థానంలో శంభాం, ఐదో స్థానంలో జల్లార గ్రూప్ నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా దుర్గాప్రసాద్, గణేష్, ఆనంద్ వ్యవహరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు, కె.కృష్ణారావు, కె.శ్రీనివాసరావు, చంద్రకిరణ్, కె.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో నిర్వాహకులు

బొడ్డేపల్లికి గుర్తింపు



బొడ్డేపల్లి శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: ఏపీ ప్రజా రవాణా వ్యవస్థలో (ఆర్టీసీ) ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘాల్లో ఒకటైన వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజయనగరం జోనల్ కార్యదర్శిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పాలకొండ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శిగా చురుకైన పాత్ర పోషిస్తున్న క్రమంలో రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు. ఈ మేరకు స్థానిక యూనియన్ సభ్యులు బొడ్డేపల్లికి అభినందనలు తెలియజేశారు.

లింగ సమానత్వం కీలకం..

భామిని: దేశ పురోభివృద్ధిలో లింగ సమానత్వం కీలకమని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక జీవనోపాధుల అభివృద్ధి కేంద్రంలో 'బాలికల చైతన్యం – లింగ సమానత్వం సాధన'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికలు చదువుకు దూరమైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే భ్రూణహత్యల వల్ల సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. బాలికలకు గౌరవప్రదమైన జీవితం అందించేలా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో బాలికలు, మెంటార్లు, తదితరులు పాల్గొన్నారు.



బాలికల దినోత్సవ ప్రదర్శనలో బాలికలు, మెంటార్లు

ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వండువలో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఆనందంగా దసరా పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆ దుర్గమ్మ చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలన్నారు.

సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ లక్ష్యం

సీతానగరం: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ యూనియన్ ముఖ్య ఉద్దేశ్యమని ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.వెంకటనాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సీతానగరం లోని మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 6,7,8 తేదీలలో విజయనగరంలోని జె కన్వెన్షన్ హాల్ నందు జరిగిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలకు, 20 విద్యా-వైజ్ఞానిక మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్ దారులందరికీ ధన్యవాదాలు తెలియ జేశారు.

ఘనంగా ముగింపు సభలు

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ ఫెడరేషన్‌గా 1944 ఏప్రిల్ 16వ తేదీన స్థాపించగా 16 ఏప్రిల్ 2024కి 80 వసంతాల పూర్తయిన సందర్భంగా ఫెడరేషన్ పుట్టిన తాపేశ్వరంలో ప్రారంభ మహాసభలు జరిగాయన్నారు.ఈ నేపథ్యంలో మండల, జిల్లాస్థాయి మహాసభలను ఈ మధ్యకాలంలో నిర్వహించామని తెలిపారు. ఈ సభలకు ముగింపుగా అక్టోబర్ 6,7,8 తేదీల్లో రాష్ట్ర మహాసభలను మన విద్యలనగరం విజయనగరంలో అత్యంత ఘనంగా నిర్వహించామని వివరించారు. ఈ ప్రతినిధుల సభలో నేటి పరిస్థితుల్లో ఉపాధ్యాయ ఉద్యమం లక్ష్యం–తక్షణ కర్తవ్యం–ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపైచర్చా పత్రంపై చర్చించి ఆమోదించినట్లు తెలిపారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్ దారులు విద్యార్థులు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు ఆమోదించినట్లు చెప్పారు. వాటిని ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. విద్యార్థి దశనుంచి ఉపాధ్యాయవృత్తిలో ఉంటూ ఏపీటీఎఫ్‌కు విశేష సేవలందించిన కీర్తిశేషులు కామ్రేడ్ పి నాగభూషణరావు కుటుంబానికి మహాసభల సావనీర్ కాపీలు అందించి సత్కరించామన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి ధనుంజయరావు, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ సత్యం నాయుడు, పి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

• అపూర్వ కలయిక..



సందడి చేస్తున్న పదో తరగతి 1992 బ్యాచ్ విద్యార్థులు

పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1992లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం స్థానిక ప్రైవేట్ కల్యాణ మండపంలో శుక్రవారం కలుసుకున్నారు. చిన్ననాటి సంగతులన్నీ గుర్తు చేసుకుని సందడి చేశారు. ఆపదలో ఉన్న తోటి స్నేహితులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. అనంతరం కోటదుర్గమ్మను దర్శించుకున్నారు.

–పాలకొండ రూరల్

అధ్వాన రోడ్లతో అవస్థలు

- ప్రమాదకరంగా మారిన గోతులు
- ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో వాహన చోదకులు



అంటికొండ వెళ్లే రహదారిపై గోతులు



వంబరెల్లి రహదారి దుస్థితి

సీతంపేట: అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగునెలలైనా రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. దీంతో నిత్యం గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు పోతేనే కాని రోడ్లు నిర్మించరా అని ప్రయాణికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని రోడ్లు కొట్టుకుపోగా, మరికొన్ని గుంతలతో నిండిపోయాయి. అంటికొండ, వంబరెల్లి, పులిగుమ్మి, మొగదార రోడ్డు, దబర, రుక్మిణిగూడ, తదితర గ్రామాల రహదారులు గోతులతో ప్రమాదకరంగా మారాయి. బస్సులు, కార్లు, వ్యాన్‌లు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నరకప్రాయం..

> రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు కొన్ని రోడ్లు కొట్టుకుపోయాయి. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.
>
> – ఎం.తిరుపతిరావు, సీపీఎం నాయకుడు



మొగదార సమీపంలో రహదారి పరిస్థితి

ఘాటెక్కిన ఉల్లి



పార్వతీపురం: ఉల్లిపాయ లేకుండా ఏ కూరా రుచిగా ఉండదు. అవి లేకుండా కూరలు వండాలంటే ఎవరూ ఇష్టపడరు. గడిచిన మూడు నెలల క్రితం కిలో రూ.25 పలికిన ధర నేడు మూడింతలు పెరిగింది. కొత్త ఉల్లిపాయలు కిలో రూ.60, పాత ఉల్లిపాయలు రూ. 70కి విక్రయిస్తున్నారు. వరుసగా పండగలు, శుభకార్యాలు ఉండడంతో ధరలు మరింతగా పెరుగుతున్నాయి. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఉల్లిసాగు తగ్గి దిగుబడి పడిపోయింది. వ్యాపారస్తులు నాణ్యతను బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. ఉల్లిగడ్డలు అధికంగా పండించే కర్నూలులో పంట ఆలస్యం కావడంతో పాటు వర్షాలు అధికంగా కురవడంతో పంట చేతికి రాక ఉల్లిపాయల లభ్యత తగ్గిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవడం వల్ల రవాణా ఖర్చులు కూడా తడిసి మోపుడవుతున్నాయి. ఇదంతా చివరకు వినియోగదారులపై పడుతోంది. ఉల్లి, వెల్లుల్లి కొనాలంటే సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఏడాది క్రితం కిలో రూ.100 లోపు ఉన్న వెల్లుల్లి ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో రూ. 350కి చేరింది. మసాలా వంటకాల్లో ప్రధాన అవసరమైన వెల్లుల్లి ధరలు ఇలా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజారుల్లో అరకొరగానైనా సబ్సిడీపై ఉల్లిపాయలను విక్రయిస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించకపోవడంతో వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు.